ప్రజాశక్తి
సోమవారం 9 సెప్టెంబర్ 2024
5
అనంతపురం

రాయదుర్గంలో వినాయక ప్రతిమకు వినతిపత్రం సమర్పించి నిరసన తెలుపుతున్న శ్రీ సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల కార్మికులు

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని శ్రీ సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల్లో పని చేసే కార్మికులు చేపట్టిన నిరసనలు ఆదివారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా కార్మికులు వివిధ రూపాల్లో తమ నిరసనలను కొనసాగించారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు అటు అధికారులు, ఇటు ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాధించాలని కోరుతూ రాయదుర్గంలో వినూత్నవంగా వినాయక ప్రతిమకు వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. అలాగే ఆత్మకూరు మండలంలో మోకాళ్లపై కూర్చొని ఆందోళన చేశారు.

స్టాక్‌పాయింట్‌లోనే 'నొక్కుడు'

- బస్తా నుంచి రెండు,మూడు కేజీలు మాయం
- మండల స్టాక్‌పాయింట్ ఇన్‌ఛార్జుల చేతివాటం
- వారికి కొందరు అధికారుల సహకారం
- మంత్రి ఇలాఖాలోనే ఇష్టారాజ్యంగా దోపిడీ
- డివిజన్ వ్యాప్తంగా ఇదే తంతు..డీలర్ల గొగ్గోలు

స్టాక్‌పాయింట్‌లో ఉన్న బియ్యం బస్తాలు

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కడుపు నింపేందుకు ప్రతినెలా రూ.వేల కోట్లు ఆర్థిక భారాన్ని భరిస్తూ రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం పూర్తిస్థాయిలో డీలర్లకు చేరడం లేదు. రేషన్ బియ్యం రవాణాలో అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. కంచే చేనే మేసిన చందంగా పౌర సరఫరాల శాఖలోని అవినీతి పందికొక్కులు స్టాక్‌పాయింట్ల వద్దే పేదల బియ్యాన్ని టన్నుల లెక్కన బొక్కేస్తున్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థలో కీలకమైన మండలస్థాయి స్టాక్(ఎంఎల్ఎస్)పాయింట్లు ఈ అక్రమాలకు అడ్డాగా మారాయి. ఇక్కడ పనిచేసే సిబ్బంది గోడౌన్లలో నిల్వ చేసిన ప్రతి బియ్యం బస్తా నుంచి రెండు, మూడు కేజీల చొప్పున తీసేస్తున్నారని సమాచారం. ఇలా కొన్ని వేల బస్తాల నుంచి అక్రమంగా తీసుకుంటున్న బియ్యాన్ని టన్నుల లెక్కన బయట వ్యాపారులకు అమ్ముకుంటూ రూ.లక్షలు గడిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో మూడు, నాలుగు కేజీల తరుగుతో రేషన్ షాపులకు బియ్యం బస్తాలు తరలిస్తుండంతో డీలర్లు నష్టపోతున్నారు. ఈ తరుగు బారి నుంచి తమను కాపాడాలని డీలర్లు పౌర సరఫరాల శాఖ అధికారులకు ఏళ్ల తరబడి మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదు. దీంతో ఎంఎల్ఎస్ పాయింట్ల వద్దే రేషన్ బియ్యం దోపిడీ అడ్డూ అదుపు లేకుండా సాగిపోతోంది.

ప్రజాశక్తి-పెనుకొండ

రూ.లక్షల్లో దోపిడీ...

పెనుకొండ డివిజన్‌లో మొత్తం 2,31,862 రేషన్ కార్డులున్నాయి. ఈకార్డుల్లో లబ్ధిదారులుగా దాదాపు 9.5లక్షల మందికి ప్రతినెల సుమారుగా 2,320 క్వింటాళ్ల బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ కేటాయిస్తోంది. ఈ బియ్యాన్ని 502 రేషన్ షాపుల ద్వారా కార్డులదారులందరికీ పంపిణీ చేస్తున్నారు. ప్రతినెల1వ తేదీనుంచి 15వ తేదీలోపు బియ్యం ఇతర నిత్యావసర సరుకులు పంపిణీని పూర్తి చేయాలి. ఒకనెల బియ్యం పంపిణీ పూర్తికాగానే తర్వాతి నెలకు కేటాయించిన బియ్యాన్ని ఎఫ్‌సీఐ గోడౌన్లనుంచి జిల్లా సివిల్ సప్లయ్‌కు చెందిన గోడౌన్లకు రవాణా చేస్తారు. అక్కడి నుంచి రవాణా కాంట్రాక్టర్ల ద్వారా ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరవేస్తారు. అక్కడికి చేరేవరకు బస్తాలకు 50 కేజీల సంచులలో కచ్చితమైన తూకంతోనే రవాణా చేస్తుంటారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు కూడా అంతే కచ్చితమైన తూకంతో డీలర్లకు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌ఛార్జులు, వారి నేతృత్వంలో పని చేసే సిబ్బంది అక్రమాలకు పాల్పడుతూ ప్రతి బస్తా నుంచి రెండు నుంచి మూడు కేజీల వరకు తీసేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ మేరకు తరగుతో ఉన్న బియ్యం బస్తాలను తూకం వేయకుండానే రేషన్ షాపులకు పంపిస్తున్నారు. రేషన్ డీలర్లు తూకం వేయాలని గట్టిగా నిలదీస్తున్నా అంత సమయం లేదని దబాయించి తరుగుతో ఉన్న బియ్యం బస్తాలనే పంపిస్తున్నట్లు తెలుస్తోంది. తూకం వేయకుండా రేషన్ షాపులకు తరలించిన బస్తాల్లో 2నుంచి 3 కేజీల వరకు తరగు ఉంటోందని డీలర్ల గగ్గోలు పెడుతున్నారు. ఇది కాకుండా బియ్యం సంచి బరువు 580 గ్రాములు కూడా కలిపి లెక్కిస్తే 100 క్వింటాళ్లకు దాదాపు 160 కేజీల బియ్యం నష్టపోతున్నామని డీలర్లు వాపోతున్నారు. డివిజన్ వ్యాప్తంగా 4 ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. వీటన్నింటిలో తరుగు రూపంలో అక్రమంగా కాజేస్తున్న బియ్యం ప్రతినెల దాదాపు 500 క్వింటాళ్లకు పైగా బ్లాక్ మార్కెట్ తరలిస్తూ రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ మొత్తం ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌ఛార్జులు, గోడౌన్ ఇన్‌ఛార్జులు, కిందిస్థాయి సిబ్బందే మింగేస్తున్నారనుకుంటే పొరపాటే. వారు అక్రమంగా సంపాదించిన సొమ్ములో సింహభాగం తమ పైఅధికారులకు వాటాలు ప్రతి నెలా ముట్టజెప్పాల్సిందేనన్న గుసగుసలు వినపడుతున్నాయి.

తూకాలు ఎగ్గొట్టేందుకే ఆర్‌ఒలు జాప్యం...

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతినెలా కార్డుదారులకు రేషన్ బియ్యం పంపిణీ పూర్తయిన తర్వాత డీలర్ల వద్ద ఉంటే ముగింపు నిల్వలను లెక్కించాలి. తర్వాతి నెలకు ఇవ్వాల్సిన కోటాలో ఈ ముగింపు నిల్వలను తగ్గించి డీలర్లకు ఆన్‌లైన్‌లో కొత్త ఆర్‌ఒలు జారీ చేయాలి. వాటి ప్రకారం డీలర్లు డబ్బు చెల్లించి ఎంఎల్ఎస్ పాయింట్‌లకు వెళితే అక్కడి ఇన్‌ఛార్జులు తూకం వేసి బియ్యం అప్పగించాలి. కానీ ఎక్కడా ఈ నిబంధనలు అమలు కావడం లేదు. ఒక నెల కోటా బియ్యం పంపిణీ 15 తేదీతో ముగిసిపోగా ఆ తర్వాత డీలర్ల వద్ద ఉన్న ముగింపు నిల్వలను లెక్కించి కొత్త ఆర్‌ఒలు ఇవ్వడానికి ఒక పూట లేదా ఒక రోజు సమయం సరిపోతుంది. కానీ నెలాఖరు వరకు సివిల్ సప్లయ్ అధికారులు ఆర్‌ఒలు ఆన్‌లైన్‌లో పెట్టడడం లేదు. ముందుగానే ఆర్‌ఒలు జనరేట్ చేస్తే ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యాన్ని తూకం వేసి అప్పగించాడానికి సమయం సరిపోతుంది. అదే రెండు, మూడు రోజుల ముందు ఆర్‌ఒలు ఇస్తే ప్రతి రేషన్ షాపునకు తూకం వేసి రవాణా చేయాలంటే అయ్యేపనికాదు. ఇదే అవకాశంగా ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌ఛార్జులు కొందరు దోపిడీకి తెరతీస్తున్నారు. ప్రతి బస్తా 50 కిలోలు ఉన్నట్లు డీలర్ పేరుతో ఇచ్చే ట్రక్ షీటులో నమోదు చేస్తున్నారు. ఆ బియ్యాన్ని డీలర్లు తూకం వేసి ఇచ్చే సరికి ఒక్కో బస్తాకు రెండు నుంచి మూడు కిలోల వరకు తక్కువ వస్తోందని డీలర్లు వాపోతున్నారు. ఇలా ఆర్‌ఒలు జాప్యం చేసి తూకాలను ఎగ్గొట్టేందుకు అవకాశం కల్పిస్తున్నందు వల్ల ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌ఛార్జులు పౌరసరఫరాల శాఖ అధికారులకు ప్రతినెలా భారీస్థాయిలో ముడుపులు చెల్లిస్తున్నారని డీలర్లు ఆరోపిస్తున్నారు.

మంత్రి ఇలాకాలోనే ఇష్టారాజ్యంగా దోపిడీ...

మంత్రి ఇలాకాలోనే ఎంఎల్ఎస్ పాయింట్లలో ఇష్టారాజ్యంగా దోపిడి జరుగుతోంది. పెనుకొండ డివిజన్‌లో 4 ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. ఎంఎల్ఎస్ పాయింట్లకు ఉన్న ఇన్‌ఛార్జులు కాకుండా ప్రయివేటు వ్యక్తులతో విధులు నిర్వర్తింపజేస్తున్నారు. వారి కనుసన్నల్లోనే బస్తాల్లో తీసివేసిన బియ్యాన్ని బయటకు తరలించి సొమ్ముచేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇంత బహిరంగగానే బియ్యం బయటకు తరలించి అమ్ముతుంటే అధికారులు తమకు ఏమి తెలీదన్నట్లు నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. స్థానిక మంత్రి చొరవ చూపి ఎంఎల్ఎస్ పాయింట్లలో జరగుతున్న దోపిడీని అరికట్టేందు చర్యలు తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు.

వివరాలు చెప్పడానికి ససేమేరా...

ఎంఎల్ఎస్ పాయింట్లలో ప్రతినెలా డీలర్లకు వెళుతున్న బియ్యం, కార్డుల వివరాలు అడిగితే 'మా మేడం చెప్పాల'ని కొందరు, 'మా సార్ చెప్పాలని' మరి కొందరు దాటవేస్తున్నారు. ఇన్‌ఛార్జులను వివరాలు అడగాలంటే వారు అందుబాటులో ఉండరు. ఫోన్‌లో సంప్రదిస్తే వారు ఫోన్లు ఎత్తడమే గగనమైపోతోంది. పందికొక్కుల్లా బియ్యాన్ని తింటూ సొమ్ముచేసుకుంటున్న వారిపై ఉన్న స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు.

ప్రతినెలా బియ్యం మిగులు చూపాల్సి వస్తోంది..

బియ్యం బస్తాల తూకం వేయకుండా డీలర్లకు సరఫరా చేయడం వల్లే ప్రతి నెల డీలర్ల వద్ద అధికంగా ముగింపు నిల్వలుంటున్నాయని డీలర్లు వాపోతున్నారు. ప్రతినెలా ఆర్‌ఒలు సరైన సమయానికి ఇచ్చి, బియ్యం బస్తాలు తూకాలు వేసి ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పెనుకొండలోని స్టాక్‌పాయింట్ గోడౌన్

అక్షరాస్యత శాతం మరింత పెంచాలి
కలెక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

జిల్లాలో అక్షరాస్యత శాతం మరింత పెంచాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం గ్రామంలోని ఆర్డీటీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తెలుగు నేర్చుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని, ఖచ్చితంగా అందరూ చదవడం, రాయడం నేర్చుకోవాలని అన్నారు. బాగా చదువుకున్న మహిళలను ఇతర మహిళలతో ఇంటరాక్ట్ చేయించాలని, అక్షరాస్యత శాతం పెంచేందుకు కృషి చేయాలని అన్నారు. కుటుంబంలో ఉన్న మహిళల్లో చదువుపై అవగాహన ఉంటే వారికి వారే సొంత నిర్ణయాలు తీసుకోవచ్చన్నారు. ఆడపిల్లలకు తొందరగా పెళ్లిళ్లు చేస్తున్నారని, ఆడపిల్లల చదువు కూడా ఎంతో ముఖ్యమని చెపాపరు. తక్కువ వయసులో పెళ్లిళ్లు చేయరాదని, ఈవిషయంలో అందరిలో మార్పు రావాలని అన్నారు. చదువు రాని వారికి వివిధ నైపుణ్య శిక్షణలు, విద్య, ఐసిడిఎస్ కార్యక్రమాలు, పొదుపు సంఘాల్లో మంచి విషయాలు తెలియజేస్తూ వారిని ఆర్థికంగా, సామాజికంగా పైకి తీసుకొచ్చే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఇఒ ఓబులమ్మ, ఐసిడిఎస్ పీడీ బిఎన్. శ్రీదేవి, వయోజన విద్యా శాఖ డిడి కె.ఆంజనేయులు, ఎంపీడీవో తేజోష్ణ, ఎంపీపీ సునీత, గ్రామ సర్పంచి వసంతకుమారి, స్వయం సహాయక సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అనంతపురంలో వినాయక మండపం వద్ద పోలీసులు

వినాయక ఉత్సవాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు రేయింబవళ్లు అప్రమత్తంగా ఉంటున్నారు. గణేష్ మంటపాలు, ప్రతిమల ఏర్పాటు మొదలు నిమజ్జనం పూర్తి అయ్యే వరకు పోలీసులు ఏమి చేయాలో ఏమి చేయకూడదో ఎస్పీ నుంచి ఇదివరకే స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఈనేపథ్యంలో నిమజ్జనం ముగిసే వరకు ప్రశాంత పరిస్థితులు కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. వినాయక మంటపాలు వద్ద ఉత్సవ కమిటీ నిర్వాహకులు నిరంతరం ఉంటూ ఎలాంటి ఘటనలకు తావులేకుండా పర్యవేక్షిస్తున్నారు. ఆయా పోలీసులు తరుచూ వినాయక మంటపాలను చెక్ చేసి ముందస్తు జాగ్రత్తలు వివరిస్తున్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో ఏర్పాటు చేసిన వినాయక మంటపాల వద్ద రాత్రిపూట ఎటువంటి ప్రమాదాలు, సంఘటనలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అదేవిధంగా నిమజ్జనానికి వీలున్న సమీప కాలువలు, కుంటలు, చెరువులు, తదితర ప్రాంతాలు, సందర్శించి అనువైన ప్రదేశాలను సూచిస్తున్నారు. నిమజ్జనం రోజు ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా ముందస్తు బందోబస్తు ఏర్పాట్లలో ఆయా పోలీసులు నిమగ్నమయ్యారు.

విజయవాడలో వర్షంలోనూ తడుస్తూ బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వరద బాధితులకు అండగా నిలబడదాం
ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రకృతి సృష్టించిన ప్రళయం వల్ల విజయవాడలో నిరాశ్రయులైన వరద బాధితులకు అండగా నిలుద్దామని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తూరు పరమేష్ పిలుపునిచ్చారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా నుంచి ఎస్ఎఫ్ఐ నాయకులు విజయవాడకు వెళ్లి మూడు రోజులుగా పలు కాలనీల్లో ప్రజలకు సేవలు చేస్తున్నారు.

ఇందులో భాగంగానే ఆదివారం కొన్ని కాలనీలో ఇళ్ల వద్దకు వెళ్లి నిత్యావసర సరుకులు, వాటర్ బాటిళ్లు, మెడికల్ కిట్లు పంపిణీ చేస్తూ తమవంతు మానవత్వాన్ని చాటుకున్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రోజుకు 2000 మందికి భోజనం, బ్రెడ్, బిస్కెట్లు, వాటర్ బాటిళ్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివ, ఎస్కెయు ప్రధాన కార్యదర్శి వంశీ, ఎస్ఎఫ్ఐ అనంతపురం నగర ఉపాధ్యక్షుడు వంశీ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సిఎం జగన్‌వి నీచ రాజకీయాలు
సిఎం సహాయనిధికి రూ.లక్ష విరాళం : ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

వరదలపై ఓవైపు విజయవాడ నగరం అతలాకుతలమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మరోవైపు వైసిపి అధినేత జగన్ నీచ రాజకీయాలు చేయడం బాధాకరమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం రాయదుర్గంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో మానవత్వంతో స్పందించాల్సి ఉండగా రాష్ట్రంలో ఉన్న ఉన్మాది జగన్ వరదల్లో కూడా బురద రాజకీయాలు చేస్తూ, తనను ఓడించిన ప్రజలపై కక్ష సాధింపు చర్యకు పాల్పడటం బాధాకరమన్నారు. బాధితులకు ఎలాంటి సాయం అందించలేని జగన్ కనీసం ప్రభుత్వం చేస్తున్న సాయానికైనా సహకరించాలని సూచించారు. బుడమేరు పాపం జగన్ వైఫల్యం అని విమర్శించారు. రాజకీయ నాయకులు ప్రజలకు అండగా ఉండాల్సిన సమయంలో అండగా ఉండకపోతే తన మీడియాతో విషం చిమ్మడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అంచనా మేరకు విజయవాడలో వరదల వల్ల రూ.6,880 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. ఈ మేరకు నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. వారంరోజులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నిద్రాహారాలు మాని పనిచేస్తున్నారన్నారు. రేయింబవళ్లు క్షేత్ర పర్యటనలు, సమీక్షలు చేసి బాధితులకు సాయం అందించేందుకు కృషి చేస్తున్నారని వివరించారు. ఇకపోతే వరద బాధితుల సహాయార్థం తాను వ్యక్తిగతంగా రూ.లక్ష ముఖ్యమంత్రి సహాయనిధికి ఇవ్వనున్నట్లు కాలవ ప్రకటించారు. నియోజకవర్గంలో దాతలు విరాళాలు చెక్కు, డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో ఇవ్వడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు నాగరాజు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు
ల్యాండ్ అండ్ రికార్డ్స్ సర్వే ఎడి రామకృష్ణ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సత్య సాయి జిల్లాలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నామనిజిల్లా ల్యాండ్ రికార్డ్స్ సర్వే ఏడి రామకృష్ణ తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎక్కువగా భూ తగాదాలు ఉన్నాయి. అన్నదమ్ముల మధ్య భూతగాదాలు, భూ అక్రమాలు, ఒకరు భూమిలో సాగులో ఉంటే మరొకరు పేరిట పట్టా ఉండటం, ఎన్నో ఏళ్లగా సాగులో ఉన్నప్పటికీ పట్టాలు లేకపోవడం, ఇతరుల పేరుమీద పాసు పుస్తకాలు ఉండటం, తదితర సమస్యలతో రైతులు సతమతమవుతుంటారు. తహశీల్దార్ మొదలుకొని కలెక్టర్ వరకు అర్జీలు సమర్పించుకొని కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటారు. మరి కొందరు అయితే రెవిన్యూ అధికారులతో న్యాయం జరగలేదని కోర్టులను ఆశ్రయిస్తుంటారు. దీంతో కోర్టులలో వాజ్యం ముగిసే వరకు ఆ భూములు ఇరు వర్గాలువారు బంజరు పెట్టుకోవడం చూస్తూనే ఉంటాము. భూ సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారుల పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. ముఖ్యంగా భూ సమస్యలు సర్వేర్ల వ్యవస్థపై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో భూ సమస్యలు పరిష్కారాలు తదితర అంశాలపై జిల్లా ల్యాండ్స్ అండ్ రికార్డ్స్ సర్వే ఏడి రామకృష్ణతో ప్రజాశక్తి జరిపిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ఆయన తెలిపారు.

ప్రశ్న : భూ సమస్యలపై జిల్లా స్థాయిలో మీరు ఏ విధంగా చర్యలు తీసుకుంటారు.?

జవాబు : సాధారణంగా భూ ఆక్రమణలు, అన్నదమ్ముల మధ్య భూ సమస్యలు, సాగులో ఒకరు ఉంటే పట్టాలు, పాసు పుస్తకాలు ఇంకొకరి పేరిట ఉండటం లాంటి సమస్యలు ఉంటాయి. ఇంకా కొందరు సరిహద్దుల సమస్యలతో వస్తుంటారు. మండల స్థాయిలో సర్వేయర్ ఉంటారు. ఆ సర్వేయర్ సరిగా న్యాయం చేయలేదని భావిస్తే ఆర్డీవో కార్యాలయంలో డిఐఒఎస్‌ఉంటారు. అక్కడ న్యాయం జరగలేదని భావిస్తే, జిల్లాస్థాయిలో తమ దగ్గరకు వస్తారు. ఇక్కడ జిల్లా స్థాయిలో ఐఒఎస్ ఉంటారు. వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారు. చలానా కట్టి గ్రీవెన్స్ లో అర్జీ ఇస్తే ఆ సమస్య జిల్లా స్థాయి జిల్లా సర్వేచర్ వెళ్లి రికార్డ్స్ ప్రకారం సర్వే చేయిస్తాము. కొందరు కోర్టులను ఆశ్రయిస్తుంటారు. కోర్టు పరిధిలోకి పోతే మేము ఏమీ చేయలేము.

ప్ర : జిల్లాలో ఎంత భూమి ఉంది.? జగనన్న భూ రక్ష సర్వే పై ప్రస్తుత పరిస్థితి ఏమిటి.?

జ : జిల్లావ్యాప్తంగా 20,97,382 లక్షల ఎకరాల భూమి ఉంది. గతంలో జగనన్న భూ రక్ష పేరుతో రీ సర్వే చేపట్టడం జరిగింది. జిల్లా మొత్తం 461 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇందులో 161 రెవెన్యూ గ్రామాల రీ సర్వే చేశాం. సరిహద్దు రాళ్ల నాటడం జరిగింది. ఆ రాళ్లపై జగనన్న భూ రక్ష అని రాయించాం. ఆ తరువాత ప్రభుత్వం మారింది. ఆ సరిహద్దురాళ్లపై జగనన్న భూ రక్ష అనే పేరును తొలగించాలని ప్రస్తుత ప్రభుత్వం ఆదేశించింది. ఆ ఆదేశాలు ప్రకారం వాటిని తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం త్వరలోనే గ్రామ సభలు నిర్వహించనున్నారు. ఏదైనా భూ సమస్యలు ఉంటే ఆ గ్రామ సభలో ప్రజలు అర్జీల రూపంలో ఫిర్యాదు చేయవచ్చు. మిగిలిన 300 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పనులు చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాలిస్తే రీ సర్వే పనులు చేపడతాం.

ప్ర : జిల్లాలో పలుచోట్ల ఇంటి పట్టాలు పొంది కూడా వారి స్వాధీనంలో స్థలాలు ఉండకపోవడానికి కారణం ఏమిటి.?

జ : పలుచోట్ల పట్టా పొంది కూడా వారి స్వాధీనంలోకి భూమి రాకపోవడానికి ప్రధాన కారణం ఆయా పంచాయతీలలో ఉండే పంచాయతీలలో లేఅవుట్ అప్రూవల్ అయి ఉండాలి. అలాగే మున్సిపల్ స్థాయిలో ఉంటే అక్కడ కూడా అప్రూవల్ చేయించుకోవాలి. ఇవేమీ జరగకుంటే ఇంటి పట్టా పొంది కూడా ప్రయోజనం ఉండదు. మరికొందరు తమ సాగులో ఉందనో, లేదా తమ స్వాధీనంలో ఉందనో కోర్టులను ఆశ్రయిస్తుంటారు.

ల్యాండ్ అండ్ రికార్డ్స్ సర్వే ఏడి రామకృష్ణ

ప్ర : ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.? సిబ్బంది కొరత ఉందా.?

జ : సిబ్బంది కొరత అయితే లేదు. ఉన్నవారితోనే పనులు జరుగుతున్నాయి. ప్రజలు సాధ్యమైనంత వరకు ఆయా గ్రామాల్లో చిన్నచిన్న భూ తగాదాలు పెద్దమనుషులతో పరిష్కరించుకోవాలి. అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిరిగే పని ఉండదు. తప్పని పరిస్థితులు అయితే సర్వే అధికారులను ఆశ్రయించవచ్చు.. ఒక్కసారి సర్వే అధికారుల సర్వేలు కూడా కాదనే వాళ్ళు ఉంటారు. జిల్లా స్థాయిలో కూడా న్యాయం జరగలేదని ఉంటే వారి ఇష్టం కోర్టులను ఆశ్రయించవచ్చు.

ప్రజాశక్తి www.prajasakti.com

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

వివిధ రూపాల్లో 'సత్యసాయి', 'శ్రీరామిరెడ్డి' కార్మికుల ఆందోళనలు

ఆత్మకూరులో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

పెండింగ్‌లో ఉన్న వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని పంపుహౌస్ వద్ద సత్యసాయి కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ కరువు జిల్లా ప్రజల దాహార్తి తీర్చడానికి సత్యసాయి బాబా ఏర్పాటు చేసిన పథకానికి ప్రభుత్వ నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. 25ఏళ్ల నుంచి నడుస్తున్న ప్రాజెక్టుకు గ్రామాలకు వెలుగునుతున్నారు తప్ప బడ్జెట్‌లో నిధులు మాత్రం కేటాయించకపోవడం లేదన్నారు. అధికారుల అసంబద్ధమైన నిర్ణయాలతో కాంట్రాక్టరు ముందుకు రాక వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలతోపాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శివశంకర, సత్యసాయి కార్మికులు శ్రీరాములు, చిన్న, శ్రీరాములు, ఇమామ్‌లు, శ్రీధర్, దివాకర్, సాయి ప్రసాద్‌రెడ్డి, హరి, చెన్నకేశవులు రమేష్‌రెడ్డి, శివ, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించాలని కార్మిక సంఘం నాయకులు రమేష్, భార్గవ్, సునీల్ డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరునెలలుగా వేతనాలు అందకపోయినప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తూ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెలలు, నెలలు వేతనాలు చెల్లించకపోతే కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి కార్మికులకు అందాల్సిన వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వీరికి చల్లా కిషోర్ ఓబుల్ రాజు, లింగప్రసాద్ సంఘీభావం తెలిపారు.

రాయదుర్గం : నీలకంఠాపురం, శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయి పథకంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున హెచ్చరించారు. శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయి కార్మికులు చేస్తున్న సమ్మె కొనసాగింది. ఇందులో భాగంగా సమస్యలు పరిష్కరించేందుకు అటు ప్రభుత్వం, ఇటు అధికారులకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ వినాయక చవితి సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమకు కార్మికులు వినతిపత్రం సమర్పించి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు 8 నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా బతకాలని ప్రశ్నించారు. తాగునీటి సరఫరా లేకుంటే గ్రామీణ ప్రజలు చాలా ఇబ్బందులు పడతారని, ఇందుకు అధికారులు పాలకులే బాధ్యులని తెలిపారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీరి సమ్మెకు సిపిఎం నాయకులు నాగరాజు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాము, సంజయ్, అంజి, రామాంజనేయులు, ప్రకాష్, కార్మికులు పాల్గొన్నారు.

నార్పల మండలంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

ఉరవకొండ : శ్రీ సత్యసాయి వాటర్ సప్లయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. కార్మికులు చేపట్టిన దీక్షకు వ్య.కా.సం నాయకులు ఆదివారం మద్దతు తెలిపి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి పథకాల కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని నాలుగు రోజుల నుండి రిలే దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరీం, వెంకటేశులు, శ్రీనివాసులు, రామాంజనేయులు, సత్యసాయి, శ్రీరామిరెడ్డి పథకాల కార్మికులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : శ్రీరామిరెడ్డి తాగునీటి పథక కార్మికుల హక్కుల సాధన కోసమై చేపట్టిన నిరవధిక సమ్మె నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా యూనియన్ మండల నాయకులు వన్నూరుస్వామి, తిప్పేస్వామి, రమేష్, హనుమంతరెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమ్మెలో మండల శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని బి.పప్పూరు పంపుహౌస్ వద్ద సత్యసాయి నీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతోపాటు సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించడం మంచిది కాదన్నారు. అలాగే అత్యవసర సేవల్లో శాశ్వత ఉద్యోగులు పని చేయాల్సిన చోట కాంట్రాక్టు కార్మికులను నియమించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, చంద్రమోహన్, నరసింహులు, ధనుంజయ, ఈశ్వరయ్య, శివశంకర్, అంకన్న, శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు

కలెక్టర్‌ను సన్మానిస్తున్న అర్చకులు

పామిడి : పట్టణంలోని భోగేశ్వర, చెన్నకేశవ స్వామి ఆలయాల్లో కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పాలకవర్గం, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత కలెక్టర్ ఆలయ విశిష్టతలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమంలో ఆలయాల కమిటీ ఛైర్మన్లు మురళీధర్ గుప్తా, సాయిప్రకాష్, నారాయణమూర్తి, వెంకటరాముడు, ఉపేంద్ర, నల్లయ్య, బి.వి.రత్నమయ్య, జె.కుమార్, శ్రీనివాసరావు, దత్తు, మండల రెవెన్యూ అధికారి శ్రీధర్‌మూర్తి, ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు చంద్ర స్వామి, అనిల్ స్వామి, పురుషోత్తం స్వామి, అప్పన్న స్వామి, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు మేము సైతం...

పామిడి : వరద బాధితుల సహాయార్థం గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు ఈశ్వర్ ఆదేశాల మేరకు మండల టిడిపి నాయకులు ఆర్.రమేష్ సౌజన్యంతో మేము సైతం టిడిపి నాయకులు వాహనం ఏర్పాటు చేసి నిత్యావసర సరుకులను సేకరించారు. ఇందులో భాగంగా పట్టణంలోని చైతన్య కాలనీ, వెంగమునాయుడు కాలనీ, గుప్తా కాలనీ, నాగిరెడ్డి కాలనీ, అంజనేయస్వామి గుడి ఏరియాల్లో బియ్యం, బేడలు తదితర నిత్యావసర వస్తువుల సేకరించారు. ఈ కార్యక్రమంలో బొమ్మా మోహన్, వడ్డే శివ, కుమార్, తిమ్మప్ప, పూజారి లక్ష్మీదేవి, రఫీ, నిరంజన్, పురుషోత్తం, సోషల్ మీడియా శివ, వడ్డే రాము తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

అవార్డు గ్రహీత దంపతులను సన్మానిస్తున్న చర్చి సభ్యులు

పామిడి : పట్టణ సిఎస్ఐ చర్చిలో ఆదివారం ఘనంగా క్రీస్తు ఆరాధనలు జరిగాయి. ఇందులో భాగంగా చర్చి ఆధ్వర్యంలో ఇటీవల తెలుగు బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీత నీలం ప్రిస్కిల్లా రత్నరాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చర్చి సెక్రటరీ పరదేశీ విజయ శేఖర్‌రాజు, చర్చి సభ్యులు వీరయ్య, జయరాజు, రాజు, మంజుల, మెర్సీ, బుజ్జి బాబు, ప్రశాంతి, మాణిక్యమ్మ, అల్లిపీరాపాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

యల్లనూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్నిప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న పుల్లారెడ్డి

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మోడల్ స్కూల్ వద్ద నివసిస్తున్న ప్రకాష్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. ప్రకాష్ అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పుట్లూరు పుల్లారెడ్డి మృతుడి ఇంటికి చేరుకుని కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం అందజేసి పరామర్శించారు.

పెయింటర్ శ్రీనివాసులుకు నివాళి

ప్రజాశక్తి-గుంతకల్లు

కామ్రేడ్ పెయింటర్ శ్రీనివాసులు 4వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో (సిపిఎం) కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ కామ్రేడ్ పెయింటర్ శ్రీనివాసులు సిపిఎం అభివృద్ధితోపాటు దళితుల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారన్నారు. అంతేగాకుండా పట్టణంలో మొదటిసారిగా పెయింటర్లను ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీ అనుబంధంగా సంఘాన్ని ఏర్పాటు చేశాడని గుర్తు చేశారు. పెయింటింగ్ పనులు చేసే సమయంలో ప్రమాదాలు జరిగినప్పుడు చనిపోయిన వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్టపరిహారం తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, పట్టణ కమిటీ సభ్యులు షబ్బీర్, తిమ్మప్ప, ఎస్‌కెఎం బాషా, చరణ్, సురేంద్ర, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులుకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

వరద ప్రాంతాల్లో గుత్తి కమిషనర్ సహాయక చర్యలు

సహాయక చర్యల్లో పాల్గొన్న జబ్బార్‌మియా

గుత్తి : రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఆదేశాలతో గుత్తి మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం సహాయక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వరద నీటికి కొట్టుకొచ్చిన చెత్తచెదారాన్నికార్మికుల ద్వారా ట్రాక్టర్లు, లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలించారు. నివాస గృహాలు, రహదారులపై పేరుకుపోయిన బురదను ఫైర్ ఇంజన్ల ద్వారా శుభ్రం చేయించారు. దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

IN THE COURT OF THE HON'BLE DISTRICT JUDGE: ANANTAPURAM
I.A.No:847/2024 in O.S.No.63/2019.

Between:
Manvi Sujatha 2.Vandana Shankar ...Plaintiffs

V/S

1.Harihara S/o Rajendra Prasad,
2.Mallikarjuna, S/o.Rajendra Prasad,
3.Madhuri D/o.Rajendra Prasad,
all are R/at Plot No.F-301, Kalpatharu Residency-II, Road No.10, Jogars Park, Kalyan, Yerrawada, Pune-411006, Maharastra.
4.Basava Prakash, S/o Jogappa, R/at.H.No.5-91, Gonappa Veedhi, Amarapuram (P&M),
5.Mahabaleswar, S/oJogappa, R/at.Plot No.A-804, Sivaranjani Apartments, Bansankari 3rd Stage, Bangalore South.
6.Gundumala jayappa, S/o G.Sanna Thimmappa, Hindu, R/at.H.No.12-1, E-Gundumala (V), madakasira (M),
7.N.lakshmi Narasimha Reddy, S/o. Narasimha Reddy, R/at.H.No.20/77, Mallinayasanapalli (V), Madakasira (M),
8.M.Raghavendra Naidu, S/o M.Narayana Naidu, R/at.H.No.26-4-46, Tyagaraja Colony, Hindupuram (P&M),
9.John Stephen, S/o S.Shyam Raj, Christian, R/at. H.No. 114- 09, 124 street, South Ozone Park, Newyork-11420, U.S.A.
10.K.Devanand, S/o.K.Narasanna, R/at. Flat No.403, S.S.Apartments, Ram Nagar, Anantapuram (P&Dt).
11.B.M.Shilashri, W/o Mallikarjuna,
12.B.M.Amogh, S/o. Mallikarjuna, Both are residing at C/o.N.A.Lakshmapur, Shiva Sankalpa, Malapur Road, Dharwad, Karnataka State. ...Defendants

ప్రతివాదులకు నోటీసు

పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తం 12/09/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

BOYAPATI RAJASEKHAR,
Advocate, Anantapuramu.

రేపు 'పొలం పిలుస్తోంది'

యల్లనూరు : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతులకు పంటల సాగులో సలహాలు, సందేహాలు ఇచ్చేందుకు రేపటి నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 10న ఉదయం వేములపల్లి, మధ్యాహ్నం తిరుమలాపురం, 11న చిలమకూరు, బొప్పేపల్లి, 17న బుక్కాపురం, తిమ్మంపల్లి, 18న గొడ్డుమర్రి, దంతలపల్లి 24న కల్లూరు, గడ్డంవారిపల్లి, 25న మెడికుర్తి, పెద్ద మల్లేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

జెఎల్ మురళిని గజమాలతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

జెఎల్ మురళికి సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టౌన్‌బ్యాంక్ అధ్యక్షుడు జెఎల్ మురళీ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదివారం నగరంలోని ఎస్ఆర్ గ్రాండ్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలోని హోసూరుకు చెందిన ఏషియన్ నేషనల్ కల్చరల్ యూనివర్శిటీ మురళీకి గౌరవ డాక్టరేట్ ప్రకటించడం సంతోషకరమన్నారు. డాక్టరేట్ తీసుకునేందుకు మురళీకి అన్ని అర్హతలూ ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేత లలిత్ కుమార్, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు సుబ్రమణ్యం, భవాని రవికుమార్, రాయల్ మురళి, సుధాకర్ నాయుడు, గంగారామ్, డిష్ నాగరాజు, కుంచపు వెంకటేష్, విశాలాక్షి, ఫిరోజ్, తాజుద్దీన్, సంగా తేజస్విని, వడ్డే భవాని, స్వామి దాస్, చమన్‌సాబ్ తనయుడు డాక్టర్ ఉమర్, రాజారావు, రంగాచారి, కృష్ణకుమార్, శ్రీధర్, వన్నూరప్ప, దళవాయి వెంకట నారాయణ, వడ్డే వెంకటేష్, జోగి రాజేంద్ర, జస్వంత్ వ్యాస్, డాక్టర్ హరి, భక్తవత్సలం నాయుడు, గంగవరం అంజి, తదితరులు పాల్గొన్నారు.

పామిడి సిఐగా యుగంధర్

పామిడి : పట్టణ నూతన సిఐగా వి.యుగంధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చన్నారు. కాగా టిడిపి నాయకులు సిఐని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా సిఐకు శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రభాకర్‌చౌదరి, శ్రీనివాసరెడ్డి, జింకల సంజీవకుమార్, నారాయణస్వామి, ముసలిరెడ్డి, బొమ్మా మోహన్, కరూరు శివశంకర్, రాజేష్‌నాయక్, శ్రీరాములు, పెద్ద రంగనాయకులు, హమాలీ గోపాల్, సుంకప్ప, వడ్డే శివ, మహమ్మద్ రఫీ, అప్పన్నగారి కుమార్, వలిపి రామాంజనేయులు, పి.శ్రీరాములు, ఓబులేసు, షేక్షావలి, కె.సురేష్, రంగస్వామి యాదవ్, కొండాపురం మధు, కొండాపురం శీన, కొండాపురం రామాంజనేయులు, కొండాపురం రాజు, హుస్సేన్‌పీరా, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్ : నగరానికి సరఫరా చేసే పిఎబిఆర్ తాగునీటి పైపులైనుకు మరమ్మతుల దృష్ట్యా సోమవారం నగరంలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్ సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు అంతరాయానికి సహకరించాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

కుందుర్పి : మండల కేంద్రంలో రూ.4లక్షల ఎంపిపి నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపిపి కమల నాగరాజు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపితోపాటు సర్పంచి మారుతీశ్వర రామమూర్తి మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం దుర్గమ్మ ఆలయం పక్కన సీసీ రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రాజగోపాల్, వై.నారాయణస్వామి, వెట్టి నాగప్ప, కొంగ మారెప్ప, ఇర్షాద్, దళిత కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

బుక్కరాయసముద్రం : మాజీ జెడ్పీటీసీ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని సిద్ధరాంపురం గ్రామంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా రామలింగారెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండెపోటుతో సిపిఐ నేత మృతి

రాయదుర్గం : సిపిఐ రాయదుర్గం తాలూకా సహాయ కార్యదర్శి గురుస్వామి (55) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. రాళ్లు కొట్టుకుని పని చేసుకుని జీవిస్తున్న గురుస్వామి ఇందులో భాగంగానే ఆదివారం ఉదయం రాయదుర్గం కొండకు వెళ్లి వచ్చాడు. ఈనేపథ్యంలో పట్టణంలోని బళ్లారి బస్టాఫ్ సమీపంలో వన్నూరుస్వామి కట్ట వద్ద ఉన్నట్టుండి ఛాతీలో నొప్పి రావడంతో నేలకులారు. వెంటనే స్థానికులు సమీప ప్రథమ చికిత్స కేంద్రం వద్దకు వెళ్లారు. పరీక్షించిన ఆర్ఎంపి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. గురుస్వామి మృతి పట్ల సిపిఐ తాలూకా అధ్యక్షులు నాగార్జున, కార్యదర్శి కొట్రేష్, ఇతర పార్టీ నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం దహన సంస్కారాలు నిమిత్తం సిపిఐ నాయకులు రూ.5,600ను కుటుంబ సభ్యులకు అందజేశారు.

నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి : సిఐ

శింగనమల : మండల వ్యాప్తంగా సోమవారం నిర్వహించనున్న వినాయక నిమజ్జన వేడుకలను ప్రజలు ప్రశాంతంగా చేసుకోవాలని సిఐ కౌలుట్లయ్య సూచించారు. ఆదివారం మండల పరిధిలోని సోదనపల్లిలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ వద్ద సిఐ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అల్లర్లు సృష్టించకుండా ప్రశాంతంగా చేసుకోవాలన్నారు. ముఖ్యంగా వినాయక ప్రతిమలను తీసుకెళ్లేటప్పుడు చిన్న పిల్లలను తీసుకెళ్లరాదన్నారు. కాగా వినాయక ప్రతిమ వద్ద బ్యాచ్-45 ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అట్టే రామాంజనేయులు, పేట శివారెడ్డి, పేట ప్రసాద్‌రెడ్డి, ఏకిలా ఆదినారాయణ, అట్టే చిన్న చౌడప్ప, ఏకిలా ఆదినారాయణ, అట్టే శంకర, అట్టే శ్రీనివాసులు, ఏకల లక్ష్మయ్య, అట్టే పెద్ద ఎర్రిస్వామి, అట్టే కంబయ్య, జానగొండ శ్రీనివాసులు, అట్టే రాజప్ప, అట్టే నాగముని, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపెద్దలతో మాట్లాడుతున్న సిఐ కౌలుట్లయ్య

విద్యార్థిని దారుణ హత్య

ప్రజాశక్తి - ఆత్మకూరు

మృతురాలు సరిత

ఆత్మకూరు మండల పరిధిలోని వడ్డుపల్లి కాలువ గట్టు సమీపంలో శనివారం యువతిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. అటుగా వెళుతున్న గొర్రెల కాపరులు యువతి మృతదేహాన్ని గుర్తించి ఆత్మకూరు పోలీసులకు సమాచారం అందించారు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు....

గుమ్మగట్ట మండలం సిరిగేదొడ్డి గ్రామానికి చెందిన బోయ సరిత (21) శనివారం సాయంత్రం ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వడ్డిపల్లి హంద్రీనీవా కాలువ పక్కన మదిగుబ్బ గ్రామానికి వెళ్ళు రహదారి సమీపంలో అటవీ ప్రాంతంలో శవమై కనిపించింది. గొర్రెలకాపర్లు ఆత్మకూరు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు మృతదేహం ఫోటోను జిల్లాలోని అన్ని వాట్సాప్ గ్రూపులకు పంపించారు. గుమ్మగట్ట మండలం సిరిగేదొడ్డి గ్రామానికి చెందిన వెంకటేశులు, పాలమ్మ దంపతులు మృతిచెందిన యువతి తమ కుమార్తె అని ధ్రువీకరించుని ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తమ కుమార్తె అనంతపురంలో ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోందని, కమలానగర్లోని రఘువీర్ టవర్స్ సమీపంలో లేడీస్ హాస్టల్ లో ఉంటుందని మృతురాలి తల్లిదండ్రులు చెప్పారు. ఆమెను అనంతపురం పంపేందుకు శనివారం ఉదయం రాయదుర్గం వచ్చి అనంతపురం వెళ్లే బస్సు ఎక్కించామని చెప్పారు. ఆ తర్వాత తమకు ఎలాంటి సమాచారం తెలియలేదన్నారు. వాట్సాప్ లో వచ్చిన సమాచారంతో మృతి చెందినది తమ కుమార్తె అని తెలిసిందన్నారు. ఈ విషయమై ఆత్మకూరు పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ హేమంత్ కుమార్ తెలిపారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న హారిక

కళ్యాణదుర్గం : కంబదూరు మండలం నూతిమడుగు గ్రామానికి చెందిన హారిక (25) కడుపునొప్పి తాళలేక ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. భర్త రమేష్ తెలిపిన వివరాల మేరకు... హారిక కొన్నేళ్లుగా కడుపు నొప్పితో బాధ పడుతుండేది. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ నయం కాలేదు. ఇందులో భాగంగానే కడుపునొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుత్తిలో వృద్ధుడు..



మృతిచెందిన వృద్ధుడు

గుత్తి : మండలంలోని జక్కలచెరువు రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వృద్ధుడు (60) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుర్తు తెలియని వృద్ధుడు గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సమాచారం అందడంతో వెంటనే జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు ఘటన స్థలానికి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

ఆత్మకూరు : మండల పరిధిలో వడ్డుపల్లికి చెందిన రైతు రామయ్య పొలంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని కాపర్ వైరును చోరీ చేశారు. శనివారం తోటకు వెళ్లిన రైతు గమనించి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా మా కక్షిదారుడ యిన అంబటి తిరుమల రెడ్డి తండ్రి:ఎ.నారాయణరెడ్డి, నివాసం:డోర్ నెం:12/4-938-3, ఆదర్శ నగర్, అనంతపురం టౌన్ అనువారు తనకు హక్కు అనుభవం గల షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంటు నెం.12546/1998 తేది:10-12-1998 అంబటి తిరుమల రెడ్డి తండ్రి:ఎ.నారాయణరెడ్డి, అనంతపురం గారి పేరుతో ఉన్న ఒరిజినల్ పత్రం అనంతపురం తాడిపత్రి బస్టాండు పాతవూరు జిరాక్స్ సెంటర్ దగ్గర పోగొట్టుకొన్నానని ఈ విషయము 1వ పట్టణ పోలీసు స్టేషన్ అనంతపురం నందు ఫిర్యాదు చేసి వారి నుంచి ఒక సర్టిఫికెట్ పొందివున్నారని కావున ప్రస్తుతం తమవద్ద ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నకలు మాత్రమే వున్నవని తెలిపియున్నారు. కావున ఎవరికైన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని గురించి గానీ సదరి పత్రం గురించి గానీ ఆక్షేపణలున్నచో ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోపల నాకు తెలపుగోరుచున్నాను.

ప్రకటన

అనంతపురం రి॥డి॥ అనంతపురం సబ్॥డి॥కి చేరిన అనంతపురం గ్రామ పొలం అనంతపురం మునిసిపల్ ఏరియాలోని ఆస్తి వివరం

వార్డు-పాత-8, క్రొత్త-21, సరిక్రొత్త-28, S.No:315/2 A.C.13.75, పైకి A.C.10.80, L.P.No:98/85 ఈ పైకి A.C.0.06, H.S:0.024, Plot No:50,

చెక్కుబంది: తూర్పు:ప్లాటు నెం:57, దక్షిణం:ప్లాటు నెం:51, పడమర: 33 అ॥రోడ్డు, ఉత్తరం:33 అ॥రోడ్డు.

A.SURESH KUMAR,
Advocate, Anantapuramu. Cell:9440204098

సిద్దేశ్వరంతోనే రాయలసీమకు సాగునీరు

సిద్దేశ్వరం సీమ పాటను ఆవిష్కరించిన అతిథులు

సీడీని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

సిద్దేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతోనే రాయలసీమ ప్రాంతానికి సాగు తాగునీరు లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం అనంతపురంలోని జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాలులో జలసాధన సమితి, రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు డాక్టర్ సిగిలిరేవు రామాంజనేయులు రచించి గానం చేసిన 'సిద్దేశ్వరం' అనే రాయలసీమ పాట ఆవిష్కరణ సభ నిర్వహించారు. రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ అధ్యక్షులు, సీమ ఉద్యమకారులు తిప్పిరెడ్డి నాగార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జలవనురుల శాఖ విశ్రాంత ఇంజనీరు పాణ్యం సుబ్రహ్మణ్యం స్వామి హాజరై సిద్దేశ్వరం పాట సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభ్యాధ్యక్షులు తిప్పిరెడ్డి నాగార్జున రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి అన్ని రాజకీయ పార్టీలు, పాలకులు ద్రోహం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతోనే రాయలసీమ సస్యశ్యామల మవుతుందన్నారు. అందుకే సిద్దేశ్వరం ప్రాజెక్ట్ అవసరాన్ని తెలియజేస్తూ ఎంతో శ్రమకోర్చి ఈ పాటను సీమ ప్రజలకు కానుకగా ఇస్తున్నామన్నారు. సుబ్రహ్మణ్య స్వామి మాట్లాడుతూ సీమ ప్రజా సంకల్పాన్ని ఏకతాటి పైకి వచ్చి సిద్దేశ్వరం ప్రాజెక్టును నిర్మించేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. సిద్దేశ్వరం పాటను అద్భుతంగా రచించి గానం చేసిన రామాంజనేయులును వక్తలు అభినందించారు. విశిష్ట అతిథులుగా జలసాధన సమితి అధ్యక్షులు రామ్ కుమార్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, గౌరవాధ్యక్షులుగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, మానవ హక్కుల వేదిక బాషా, కుందూ పరివాహక పోరాట సమితి నాయకులు కామిని వేణుగోపాల్ రెడ్డి, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ తెలుగు ఆచార్యులు సదాశివరెడ్డి, భారత వికాస ప్రజా రైతు సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ్ రెడ్డి, అనంతపురం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ జెన్నే ఆనంద్ కుమార్, డాక్టర్ ఉద్దండం చంద్ర శేఖర్, రచయిత, గాయకులు రామాంజనేయులు హాజరై ప్రసంగించారు. అరుణోదయ కళాబృందం, నాయకులు జంగం శ్రీనివాస్, సాదు శేఖర్ ఆలపించిన సీమ ప్రజా చైతన్య గేయాలు ఎంతగానో అలరించాయి.